క్లుప్తంగా

67 మంది విద్యార్థులకు సైకిళ్ల పంపిణీ



తాళ్లరేవు హైస్కూల్‌లో విద్యార్థికి సైకిల్ అందజేస్తున్న ఓఎన్జీసీ ప్రతినిధులు

తాళ్లరేవు: మండల కేంద్రమైన తాళ్లరేవు, పి.మల్లవరం హైస్కూళ్లలో విద్యనభ్యసిస్తున్న 67 మంది షెడ్యూల్ క్యాస్ట్ విద్యార్థులకు ఓఎన్జీసీ ఈడీ రత్నేష్‌కుమార్ సైకిళ్లను పంపిణీ చేశారు. మంగళవారం స్థానిక ఎస్ఎన్వీ జెడ్పీ హైస్కూల్‌లో ఓఎన్జీసీ షెడ్యూల్ క్యాస్ట్ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో హైస్కూల్‌కు ఆరు కిలోమీటర్ల దూరం నుంచి వస్తున్న విద్యార్థులకు సైకిళ్లను అందజేశారు. గ్రామ సర్పంచ్ రెడ్డి అరుణ సుహాసినీదేవి, హైస్కూల్ హెచ్ఎం జె.ఆశాలత, ఓఎన్జీసీ ప్రతినిధి కల్యాణ్ చక్రవర్తి, విశ్రాంత ఓఎన్జీసీ ఉద్యోగి రెడ్డి గిరిబాబు, విశ్వజన కళామండలి రాష్ట్ర అధ్యక్షుడు వడ్డి ఏడుకొండలు, మండల దళిత యునైటెడ్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు పెయ్యల రమేష్ పాల్గొన్నారు.

అభివృద్ధి పనులపై సమీక్ష



పీడబ్ల్యూడీ కార్యదర్శి జయంత్ కుమార్‌తో సమీక్షిస్తున్న మల్లాడి

యానాం: యానాం నియోజకవర్గ పరిధిలో పీడబ్ల్యూడీ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పనుల గురించి పుదుచ్చేరి పీడబ్ల్యూడీ కార్యదర్శి డాక్టర్ జయంత్ కుమార్‌తో పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రతినిధి మల్లాడి కృష్ణారావు సమీక్షించారు. మంగళవారం ఆర్ఏఓ మునిస్వామి అధ్యక్షతన ఆయన ఛాంబర్‌లో సమావేశం జరిగింది. పుదుచ్చేరికి అవల ఉన్న యానాం, మాహే, కారైకల్ రీజియన్‌లలో అన్ని శాఖల కార్యదర్శులు పర్యటించి నివేదిక ఇవ్వాలని ఇటీవల ఎల్జీ కె కైలాశనాథన్ ఆదేశాల మేరకు జయంత్ కుమార్ యానాం విచ్చేశారు. ఐలాండ్ నంబరు–3 ఉడెన్‌వాక్ బ్రిడ్జి పనులకు మళ్లీ అనుమతులు మంజూరు చేయాలని, శివంబాత్ వద్ద ఉన్న రెండు భారీ ఏనుగు విగ్రహాలను కాంస్య విగ్రహాలుగా మలచేలా అనుమతించాలని కోరారు. పీడబ్ల్యూడీ రోడ్లకు రూ.2 కోట్లు మంజూరు చేయాలని, టూరిస్ట్ గార్డ్‌లను నియమించాలని కోరారు. కార్యక్రమంలో పీడబ్ల్యూడీ అధికారులు పాల్గొన్నారు.

యాక్టిజన్ క్లబ్ ఏర్పాటు

ఐ.పోలవరం: పాఠశాల స్థాయిలో యాక్టిజన్ క్లబ్‌లు ఏర్పాటు చేస్తున్నట్టు గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులు శ్రీ వీధి సురేష్ బాబు మంగళవారం తెలిపారు. ఐ.పోలవరం జెడ్పీ ఉన్నత పాఠశాలలో ×దేశ్ అప్నే సహాయక్ ఫౌండేషన్ కార్యక్రమంలో భాగంగా కో ఆర్డినేటర్ శ్రీ మాదే ప్రశాంత్ బాబు ఆధ్వర్యంలో 6, 7 తరగతుల విద్యార్థులకు యాక్టిజన్ క్లబ్‌లు ఏర్పాటు చేసి బేస్ లైన్ టెస్ట్ నిర్వహించామని తెలిపారు. కార్యక్రమంలో గొలకోటి రాంబాబు, దంగుడు బియ్యం నారాయణరావు, విప్పర్తి ఎస్తేరు రాణిలు పాల్గొన్నారు.

మందుగుండు సామగ్రి అక్రమ నిల్వలపై దాడులు

అమలాపురం టౌన్: అమలాపురం పట్టణంలో రెండు చోట్ల బాణసంచా, మందుగుండు సామగ్రి అక్రమ నిల్వలపై పట్టణ సీఐ పి.వీరబాబా ఆధ్వర్యంలో పోలీసులు మంగళవారం ఆకస్మిక దాడులు నిర్వహించారు. కొంకాపల్లి, దుడ్డివారి అగ్రహారంలో ఈ దాడులు నిర్వహించి మొత్తం రూ.59 వేల మందు సామగ్రి అక్రమ నిల్వలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. కొంకాపల్లిలో ఓ డాబాపై నిర్మించిన షెడ్డులో రూ.51 వేల విలువైన సామగ్రిని అక్రమంగా నిల్వగా ఉంచారు. దుడ్డివారి అగ్రహారంలో ఓ కిరాణా షాపులో రూ.8 వేల విలువైన సామగ్రి అక్రమ నిల్వ ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. బాధ్యులపై కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ వీరబాబు తెలిపారు.

జాతీయ స్థాయి పోటీలకు హేమంత్



అమలాపురం రూరల్: పశ్చిమ గోదావరి జిల్లా మార్టేరులో జరిగిన అండర్ 17 రాష్ట్ర స్థాయి బాస్కెట్‌బాల్ పురుషుల పోటీలో ఇందుపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థి వి.హేమంత్ ప్రతిభ చాటి ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా స్థాయిలో జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. నవంబర్ 17 నుంచి 22 వరకు ఛత్తీస్‌గఢ్‌లో జరిగే జాతీయస్థాయి పోటీలకు హేమంత్ ప్రాతినిధ్యం వహిస్తాడని పాఠశాల పీఈటీ వి.నరసింహారావు తెలిపారు. హేమంత్‌ను సర్పంచ్ చొల్లంగి శివాళిని ప్రధానోపాధ్యాయుడు విత్తనాల శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు, ఎస్ఎంసీ చైర్మన్, సభ్యులు అభినందించారు.

అన్నదాతకు ఏదీ ఆసరా?

- కర్షకులను విస్మరిస్తున్న కూటమి ప్రభుత్వం
- ఏటా రూ.20 వేలు సాయం అందిస్తామని ఎన్నికల్లో హామీ
- గద్దెనెక్కిన తర్వాత ఆ ఊసే లేదు
- పెట్టుబడి సాయం కోసం తప్పని తిప్పలు

రైతులకు పెట్టుబడి సాయం కింద ఏటా రూ.20 వేలు అందిస్తామని ఎన్నికల ముందు హామీ ఇచ్చిన కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఐదు నెలలు కావస్తున్నా ఆ ఊసే ఎత్తడం లేదు. అన్నదాత సుఖీభవ పథకం ద్వారా రూ.20 వేల పెట్టుబడి సాయం రైతుల ఖాతాల్లో ఇప్పటికీ జమ కాలేదు. దీంతో రైతన్నలు పంట సాగుకు అప్పులు చేయాల్సిన దుస్థితి ఏర్పడింది.



ముమ్మిడివరంలో సాగులో ఉన్న వరి చేను

ముమ్మిడివరం: ముమ్మిడివరం, అమలాపురం నియోజకవర్గాలు వ్యవసాయాధారిత ప్రాంతాలు. ప్రకృతి వైపరీత్యాల కారణంగా గత 20 ఏళ్లుగా వ్యవసాయం తీవ్ర ఒడిదుడుకులకు లోనవుతోంది. కరవు కారణంగా పంటలు పండినా గిట్టుబాటు ధర లేకపోవడంతో రైతులు అప్పుల పాలవుతున్నారు. ప్రభుత్వ గణాంకాల ప్రకారం ఒక్కో రైతుకు రూ.2.5 లక్షల అప్పు ఉన్నట్లు నివేదికలు చెబుతున్నాయి. ప్రభుత్వం అమలు చేస్తున్న సున్నా వడ్డీ, పావలా వడ్డీ రుణాలు సైతం అన్నదాతలను ఆదుకోలేకపోతోంది. మంత్రి నారా లోకేష్ అధికారంలోకి రాకముందు వ్యవసాయ మీటర్లు ఉన్న మోటార్లను పగల గొట్టమని పిలుపు నిచ్చారు. తీరా అధికారంలోకి వచ్చాక ఆ ఊసే ఎత్తడం లేదు. ఖరీఫ్ సీజన్ ప్రారంభమై నాలుగు నెలలు కావస్తోంది. ఇచ్చిన హామీని గద్దెనెక్కిన తర్వాత చంద్ర బాబు అమలు చేయకపోవటంపై కర్షకులు మండి పడుతున్నారు.

రైతు భరోసాతో లబ్ధి

గత నాలుగేళ్లలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఏటా రైతు భరోసా పథకం కింద ఒక్కో రైతుకు రూ.13,500లు అందజేసింది. ఈ సొమ్ము అన్నదాతకు భరోసాగా నిలిచేది. పంట పెట్టుబడికి అప్పులు చేయాల్సిన దుస్థితి తప్పేది. కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో పెట్టుబడి సాయం కింద రూ.20 వేలు ఇస్తామని ప్రకటించి అన్నదాతలకు ప్రలోభానికి గురి చేసింది. తీరా అధికారంలోకి వచ్చాక ఆ ఊసే ఎత్తకపోవడంపై రైతులు తలలు పట్టుకుంటున్నారు. అధిక వడ్డీలకు రుణాలు తెచ్చి అప్పుల పాలవుతున్నారు. పంటల బీమా పథకం, అన్నదాత సుఖీభవ సాయం ఇవ్వకపోతే పంటలను ఎలా సాగు చేయాలంటూ రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇదేనా రైతులను ఉద్ధరించే పాలన అంటూ కూటమి ప్రభుత్వంపై నిప్పులు చెరుగుతున్నారు. జీవో 22ను రద్దు చేయాలని, 2023 ఖరీఫ్ సీజన్‌లో పంటలు నష్ట పోయిన రైతులకు బీమా పరిహారం ఇవ్వాలని, అన్నదాత సుఖీభవ, పంటల బీమా పథకం అమలు చేయాలని రైతులు కోరుతున్నారు.

ఆదుకోకుంటే అప్పులే శరణ్యం



కూటమి ప్రభుత్వం రైతులను ఆదుకోవాలి. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు అమలు చేయాలి. పెట్టుబడి సాయం తక్షణం అందించాలి. వివక్షతకు తావు లేకుండా రైతు పథకాలు అన్నింటినీ అమలు చేయాలి. రైతులందరికీ న్యాయం చేయాలి.

– కర్రి సత్యనారాయణ, రైతు, కర్రివానిరేవు.

హామీలు నెరవేర్చాలి



అన్నదాత సుఖీభవ పథకంలో భాగంగా పెట్టుబడి సాయం రూ.20 వేలు తక్షణమే విడుదల చేయాలి. ప్రకృతి వైపరీత్యాల వల్ల నష్ట పోతున్న రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి. పంటకు గిట్టుబాటు ధర కల్పించాలి.ఎన్నికల ముందు కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చి రైతులకు అండగా నిలవాలి.

– ఎం.రామరాజు, రైతు, అయినాపురం.

ప్రాణాంతకంగా మారిన విద్యుత్ వైర్లు



ప్రమాదంలో గాయపడిన లోవరాజు

ఐ.పోలవరం: మురమళ్ల రాఘవేంద్ర వారధి వద్ద గోదావరిలో వేలాడుతున్న విద్యుత్ వైర్లు మత్స్యకారులకు ప్రాణాంతకంగా మారాయి. జీవనాధారమైన చేపల వేట కోసం పడవ మీద వెళుతున్న సమయంలో విద్యుత్ వైర్లు తగులుకొని లోవరాజు అనే మత్స్యకారుడు మంగళవారం తీవ్రంగా గాయపడ్డాడు. అతనిని వైద్యం కోసం కాకినాడ తరలించారు. దీనిపై మండిపడ్డ మత్స్యకారులు స్థానిక ముమ్మిడివరం ఎమ్మెల్యే దాట్ల సుబ్బరాజు (బుచ్చిబాబు) క్యాంపు కార్యాలయం వద్ద ఆందోళనకు సిద్ధమయ్యారు. వారిని సముదాయించిన ఎమ్మెల్యే బుచ్చిబాబు బాధితుడికి న్యాయం చేస్తానని హామీ ఇచ్చారు. విద్యుత్ అధికారులతో మాట్లాడి సమస్య పరిష్కరించాలని ఆదేశించారు.

జాతీయ పోటీలకు ఎస్‌కేబీఆర్ విద్యార్థి

అమలాపురం రూరల్: ఎస్‌డీఈ గవర్నమెంట్ వుమెన్స్ కాలేజీ కాకినాడలో 23వ తేదీన జరిగిన జరిగిన ఆదికవి నన్నయ యూనివర్సిటీ ఇంటర్ కళాశాల తైక్వాండో పోటీలలో ఎస్‌కేబీఆర్ కళాశాల విద్యార్థులు ఎ.దినేష్ ఆదిత్య, భార్గవి శ్రీకళ గోల్డ్ మెడల్ సాధించారు. వీరిలో దినేష్ ఆదిత్య జాతీయ స్థాయి పోటీలకు అర్హత సాధించారు. 6 నవంబర్ 9 వరకూ పంజాబ్ అమృతసర్‌లో జరిగే ఆల్ ఇండియా ఇంటర్ యూనివర్సిటీ పోటీలలో పాల్గొంటారని తెలిపారు.

500 మంది పోలీసులకు వైద్య పరీక్షలు

అమలాపురం టౌన్: పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాల సందర్భంగా జిల్లా పోలీసుశాఖ ఆధ్వర్యంలో రెండో రోజు మంగళవారం కూడా అమలాపురం, రామచంద్రపురం, ఊబలంక ప్రాంతాల్లో వైద్య శిబిరాల ద్వారా 500 మంది పోలీసులకు పలు రకాల వైద్య పరీక్షలు చేశారు. అమలాపురం, కొత్తపేట, రామచంద్రపురం పోలీస్ సబ్ డివిజన్ల పరిధిలో 40 సంవత్సరాలు దాటిన పోలీసులు, హోంగార్డులు, మినిస్టీరియల్ ఉద్యోగులకు, క్లాస్ ఫోర్ సిబ్బందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. రాజమహేంద్రవరం ఆల్‌కట్ ల్యాబ్స్ సంస్థ పర్యవేక్షణలో గుండె, కిడ్నీ, కాలేయం, థైరాయిడ్, బీపీ, మధుమేహం, లిపిడ్ ప్రొఫైల్ తదితర రుగ్మతలకు ఉచిత వైద్య పరీక్షలు, మందుల పంపిణీ జరిగాయి. జిల్లా ఎస్పీ బి.కృష్ణారావు ఆధ్వర్యంలో అమలాపురంలోని గ్రాండ్ పార్కు హోటల్, రావులపాలెం మండలం ఊబలంకలోని ఎస్‌వీ కల్యాణ మండపం, రామచంద్రపురంలోని లయన్స్ క్లబ్ హాలులో జిల్లా పోలీసులకు మూడు సబ్ డివిజన్లకు సంబంధించి వైద్య శిబిరాలు జరిగాయి. దాదాపు 30 మంది వైద్యులు ఈ శిబిరాల్లో వైద్య సేవలు అందించారు.



అమలాపురం వైద్య శిబిరంలో గుండె పరీక్ష చేస్తున్న దృశ్యం

బాణసంచా దుకాణానికి అనుమతి తప్పనిసరి

- ఆర్డీవో మాధవి



అమలాపురం టౌన్: దీపావళి పండగ సందర్భంగా బాణసంచా దుకాణం నిర్వహించే ప్రతి వ్యాపారి లైసెన్స్‌ను విధిగా పొందాలని అమలాపురం ఆర్డీవో కె.మాధవి సూచించారు. స్థానిక ఆర్డీవో కార్యాలయంలో లైసెన్సు బాణసంచా దుకాణదారులతో ఆర్డీవో మాధవి మంగళవారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. అగ్ని ప్రమాదాలకు తావు లేకుండా లైసెన్సు పొందిన ప్రతీ దుకాణదారుడు ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని ఆమె సూచించారు. బాణసంచా దుకాణాల వద్ద ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో ఆమె వివరించారు. మైనర్లు దుకాణాల్లో పనిచేసేందుకు వీలులేదని పేర్కొన్నారు. గతంలో బాణసంచా దుకాణాల్లో పనిచేసిన అనుభవం, అవగాహన ఉన్నవారిని మాత్రమే దుకాణాల్లో పనిచేసేందుకు అనుమతి ఇవ్వాలని సూచించారు. అవగాహన లేనివారిని దుకాణాల్లో పెట్టుకుంటే చర్యలు తప్పవని హెచ్చరించారు. నిబంధనలు అతిక్రమించిన వారు శిక్షార్హులు అవుతారని హెచ్చరించారు.

పనులు పూర్తి చేశారు.. ప్రమాదాన్ని మరిచారు



గొల్లవిల్లిలో ప్రమాదకరంగా ఉన్న రహదారి

ఉప్పలగుప్తం: మండలంలోని గొల్లవిల్లి పంచాయతీ పరిధి అమ్మన్నగ్రహారం ప్రాంతంలో ఇటీవల ఆర్‌డబ్ల్యూఎస్ ప్రధాన పైపులైను లీకు కావడంతో సంబంధిత అధికారులు మరమ్మతులు చేపట్టారు. కాని ఆ ప్రాంతాన్ని మొక్కుబడిగా మట్టితో పూడ్చి చేతులు దులిపేసుకున్నారు. దీంతో ఒకపక్క ప్రధాన రహదారి వెంబడి ప్రయాణించే ప్రయాణికులకు ప్రమాదాలు చోటు చేసుకోవడంతో పాటు, దిగువ ప్రాంతంలో ఉన్న రైతులకు సాగునీటి ప్రవాహానికి ఆటంకం కలుగుతోందని స్థానికులు ఆవేదన చెందుతున్నారు. ఇప్పటికైనా అధికారులు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

డ్రాఫ్ట్ ఓటర్ల జాబితాలు అందజేత



డ్రాఫ్ట్ ఓటర్ల జాబితాను అందజేస్తున్న ఆర్ఏఓ మునిస్వామి, జయంత్‌కుమార్

యానాం: యానాం నియోజక వర్గానికి సంబంధించి ఎన్నికల శాఖ రూపొందించిన ఇంటిగ్రేటెడ్ డ్రాఫ్ట్ ఎలక్టోరల్ జాబితాలను మంగళవారం ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ ఆఫీసర్, ఆర్ఏఓ మునిస్వామి వివిధ రాజకీయ పార్టీల నాయకులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాబితాకు సంబంధించి ఏవైనా అభ్యంతరాలు ఉంటే తెలిపేందుకు నవంబర్ 28 వరకు అవకాశమిస్తున్నట్లు చెప్పారు. ఓటర్ల జాబితాకు సంబంధించి ప్రత్యేక క్యాంప్‌లు డిసెంబర్ 24 నుంచి ప్రారంభిస్తామన్నారు. ఎన్నికల కమిషన్ ఆదేశాను సారం వచ్చే ఏడాది 6న తుది ఓటర్ల జాబితా ప్రచురణ ఉంటుందన్నారు. కార్యక్రమంలో పుదుచ్చేరి పీడబ్ల్యూడీ, పర్యాటక శాఖ సెక్రటరీ జయంత్ కుమార్, బీజేపీ అధ్యక్షుడు కనకాల రాజు, కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు అర్ధాని దినేష్, డీఎంకే అధ్యక్షుడు భాషా, ఎన్నికల కార్యాలయ ప్రతినిధి తిరుకోటి అర్జునరావు పాల్గొన్నారు.

పుదుచ్చేరి ఆవిర్భావ వేడుకకు ఏర్పాట్లు

యానాం: నవంబర్ 1న పుదుచ్చేరి విమోచన దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆ రోజు స్థానిక జీఎంసీ బాలయోగి క్రీడా ప్రాంగణంలో వివిధ కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. ఆర్ఏఓ మునిస్వామి జాతీయ జెండా ఆవిష్కరిస్తారని అనంతరం విద్యార్థినీ విద్యార్థులచే వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు జరుగుతాయని సమాచారశాఖ ఓ ప్రకటనలో తెలిపింది. ఉదయం జాతీయ జెండా ఆవిష్కరణ, గాడ్ ఆఫ్ హానర్, శాంతి కపోతాలు ఎగుర వేయడం, ఆర్ఏఓ ప్రసంగం, మార్చ్ ఫాస్ట్, బహుమతుల ప్రదానం తదితర కార్యక్రమాలు ఉంటాయన్నారు. జాతీయ గీతాలాపనతో కార్యక్రమం ముగిస్తుందన్నారు. నిర్వహణకు ఏర్పాట్లు జరుగుతున్నాయన్నారు.

అక్రమ మందుగుండు సామగ్రి సీజ్



నడిపూడిలో స్వాధీనం చేసుకున్న మందుగుండు సామగ్రితో ఎస్సై శేఖర్‌బాబు

అమలాపురం రూరల్: మండలంలోని నడిపూడి గ్రామంలో ఒక ఇంట్లో దాచిపెట్టిన మందుగుండు సామగ్రిని అమలాపురం తాలూకా పోలీసులు మంగళవారం రాత్రి పట్టుకున్నారు. ఎస్సై శేఖర్‌బాబు తెలిపిన సమాచారం మేరకు నిబంధనలకు విరుద్ధంగా అక్రమంగా బాణసంచా తయారీ కోసం వినియోగించే మందుగుండు ముడి సరుకులను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఒక ఇంట్లో బాణసంచా తయారీకి కోసం భారీగా మందుగుండు సామగ్రి నిల్వ చేశారన్న సమాచారం మేరకు పోలీసులు దాడి చేశారు. ఈ దాడిలో రూ. లక్షవిలువైన సూరేకారం, నల్లమందు, వత్తులు , 19షాట్లు, ఇతర మందు గుండు సామగ్రిని సీజ్ చేసినట్లు ఎస్సై శేఖర్‌బాబు తెలిపారు. అనుమతులు లేకుండా బాణాసంచా నిల్వ చేసి తాయరీ చేస్తున్న వ్యాపారి ఎ.నటరాజుపై కేసు నమోదు చేసినట్టు చెప్పారు.

బాణసంచా విక్రయదారులు నిబంధనలు పాటించాలి



నీలపల్లిలో బాణసంచా విక్రయ కేంద్రాల వద్ద దుకాణదారులతో మాట్లాడుతున్న తహసీల్దార్ త్రినాథరావు తదితరులు

తాళ్లరేవు: దీపావళి పండగ సందర్భంగా తాత్కాలిక బాణసంచా విక్రయ కేంద్రాల వారు ప్రభుత్వ నిబంధనలను కచ్చితంగా పాటించాలని తహసీల్దార్ పితాని త్రినాథరావు కోరారు. కలెక్టర్, కాకినాడ ఆర్డీఓల ఆదేశాల ప్రకారం మంగళవారం ఆయన కాకినాడ అడిషనల్ ఎస్సై సత్యనారాయణ, డిప్యూటీ తహసీల్దార్ ఎం.సూరిబాబు, స్థానిక వీఆర్వోలతో కలిసి మండల పరిధిలోని సుంకరపాలెం, నీలపల్లి, తాళ్లరేవు తదితర గ్రామాలలో ప్రతిపాదిత దుకాణాల స్థలాలను పరిశీలించారు. తహసీల్దార్ మాట్లాడుతూ దుకాణదారులు జీఎస్టీ తప్పనిసరిగా చెల్లించాలని, సంబంధిత స్థల యజమాని అంగీకార పత్రం ఉండాలని, దుకాణాల మధ్య మూడు మీటర్ల దూరం ఉండాలని, ప్రతీ దుకాణం వద్ద నీటి తొట్టెలు, ఇసుక బకెట్లు సిద్ధంగా ఉంచాలని, 18 ఏళ్లు పైబడిన వారు మాత్రమే విక్రయాలు సాగించాలని తెలిపారు. ఎటువంటి ప్రమాదాలకు చోటులేకుండా, ఆస్తి, ప్రాణ నష్టం వాటిల్లకుండా అవసరమైన అన్ని జాగ్రత్తలూ తీసుకోవాలన్నారు. ఆయా నిబంధనలు ఉల్లంఘించే వారిపై కఠిన చర్యలు చేపడతామని తెలిపారు.

బాణసంచా సామగ్రి నిల్వ చేస్తే చర్యలు

అల్లవరం: జనవాసాల మధ్య ఎవరైనా బాణసంచా సామగ్రిని నిల్వ చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్సై హరీష్‌కుమార్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. దీపావళి సందర్భంగా బాణసంచా అమ్మేవారు నిర్లక్ష్యంగా వ్యవహరించరాదని తెలిపారు. అనుమతులు లేకుండా బాణసంచా నిల్వ చేసే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. తాత్కాలిక లైసెన్స్ తీసుకున్న వ్యాపారస్తులు ఫైర్ సేఫ్టీ నిబంధనలు పాటిస్తూ నిర్దేశించిన స్థలాల్లో మాత్రమే బాణసంచా అమ్మకాలు చేయాలన్నారు. మండలంలో ఏడు నిర్దేశిత ప్రాంతాల్లో 21 షాపులకు తాత్కాలిక లైసెన్స్‌లు మంజూరయ్యాయని తెలిపారు.

జనసేనకు గౌరవం దక్కకపోతే తిరగబడతాం



పరిచయ కార్యక్రమంలో మాట్లాడుతున్న తాతాజీ

అమలాపురం టౌన్: నియోజకవర్గంలో కూటమి ప్రభుత్వపరంగా ఏ కార్యక్రమం, సభ జరిగినా టీడీపీ నాయకులు ఎక్కడో చివర్లో జనసేన నాయకులకు కుర్చీలు వేసి మొక్కుబడిగా చూస్తే ఊరుకోం, గౌరవం దక్కకపోతే తిరుగుబాటు చేసేందుకు వెనకాడమని ఆ పార్టీ నేత కల్వకొలను తాతాజీ హెచ్చరించారు. పట్టణ చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడిగా, కోనసీమ కాపు జేఏసీ కన్వీనర్‌గా ఉన్న ఆయన ఇటీవల కాంగ్రెస్ నుంచి జనసేనలో చేరారు. అమలాపురంలో మంగళవారం ఏర్పాటు చేసిన పరిచయ కార్యక్రమ సభలో ఆయన ఘాటు వ్యాఖ్యలు చేశారు. నియోజకవర్గంలో సార్వత్రిక ఎన్నికల విజయంలో 50 శాతం ఓట్లు జనసేనవే అని గుర్తించుకోవాలని సూచించారు. నియోజకవర్గంలో ఏ నిధులు వచ్చినా, ఎలాంటి గ్రాంటు వచ్చినా 40 శాతం జనసేన నాయకులు, కార్యకర్తలు సూచించిన పనులకే కేటాయించాలన్నారు. కూటమి ప్రభుత్వం నియోజకవర్గంలో మద్యాన్ని ఎమ్మార్పీ ధరలకే అమ్మాలని స్పష్టం చేశారు. ఇసుక దందా చేస్తే చూస్తూ ఊరుకోబోమని, అవినీతి ఎక్కడ జరిగినా ప్రశ్నిస్తామని తెలిపారు. ఈయన వ్యాఖ్యలకు సభలో పాల్గొన్న జనసేన నాయకులు, కార్యకర్తలు చప్పట్లు కొట్టి మద్దతు పలికారు.

ఉత్సాహ భరితంగా కళా ఉత్సవ్

- ఆకట్టుకున్న బాలల నృత్య ప్రదర్శన

యానాం: పుదుచ్చేరి ప్రభుత్వం సమగ్ర శిక్షా ప్రాజెక్టు ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక ఎస్ఎస్ఏ కాన్ఫరెన్స్ హాలులో నిర్వహించిన ×కళా ఉత్సవ్–2024₹ జిల్లా స్థాయి పోటీలు ఉత్సాహ భరితంగా జరిగాయి. నియోజకవర్గ పరిధిలోని వివిధ ప్రభుత్వ, ప్రైవేట్ స్కూల్స్‌కు చెందిన బాల, బాలికలు చేసిన నృత్యాలు ఆకట్టుకున్నాయి. వొకల్ మ్యూజిక్ విభాగంలో క్లాసికల్, ఫోక్, ట్రైబల్, డివోషనల్ పోటీలు, ఇన్‌స్ట్రుమెంటల్ విభాగంలో క్లాసికల్, పెరుక్యూషన్, మెలోడిక్, ఆర్కెస్ట్రా పోటీలు, విజువల్ ఆర్ట్స్‌లో డ్రాయింగ్, పెయింటింగ్ తదితర పోటీలు, డ్యాన్స్ విభాగంలో రీజినల్ ఫోక్, ట్రైబల్, కాంటెపరరీ కొరియోగ్రఫీ, డ్రామా థియేటర్, ట్రెడిషనల్ స్టోరీ టెల్లింగ్ పోటీలను నిర్వహించారు. ఈ పోటీల్లో ప్రభుత్వ ,ప్రైవేట్ స్కూల్స్‌కి చెందిన 150 మంది బాల, బాలికలు పాల్గొన్నారు. కార్యక్రమంలో విద్యాశాఖాధికారి పంపన లక్ష్మణ్ ప్రవీణ్, ఎస్ఎస్ఏ ఏడీపీసీ కమిడి ప్రభాక రరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



సంప్రదాయ నృత్యంతో అలరించిన చిన్నారులు



అబ్బుర పరిచిన గిరిజన నృత్యం

కొనసాగిన ఎన్ఎస్ఎస్ సేవా కార్యక్రమాలు

యానాం: 'దివాళి విత్ మై భారత్' కార్యక్రమంలో భాగంగా రెండో రోజు మంగళవారం స్థానిక డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్లు 1,2ల ఆధ్వర్యంలో వివిధ సేవా కార్యక్రమాలను నిర్వహించారు. స్థానిక ఇందిరా గాంధీ మార్కెట్, జిప్‌మెర్ ఆసుపత్రి ఆవరణల్లో స్వచ్ఛ భారత్ నిర్వహించారు. వలంటీర్లు మార్కెట్‌లో పేరుకు పోయిన చెత్తను తీసి వేయడంతో పాటు ఆసుపత్రిలో రోగులకు సేవలను అందించారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ రీజినల్ కో ఆర్డినేటర్ చింతపల్లి కృష్ణ సుధాకర్, ఎన్వైకే అధికారి టి గోపి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ అధికారులు డాక్టర్ చెల్లే నరేష్, సిద్దిరెడ్డి శ్రీనివాస్, డాక్టర్ తాతాపూడి ముత్యాలు, ఎన్ఎస్ఎస్ వలంటీర్లు పాల్గొన్నారు.



సేవా కార్యక్రమాల్లో ఎన్ఎస్ఎస్ వలంటీర్లు